## క్లుప్తంగా

### రూ.8.05 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సంగెం: కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు పైలాన్ వద్ద ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు.. భూనిర్వాసితులు 863 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ చేశారు. అనంతరం సంగెం మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలోని కస్తూర్బా నూతన భవనానికి సమగ్ర శిక్ష నిధులురూ 3 కోట్ల 25లక్షలు, మండలంలోని లోహిత నుంచి పర్వతగిరి మండలం గోపనపల్లి వరకు సీఆర్ఆర్ నిధులు రూ.4 కోట్ల 80లక్షలతో నిర్మించనున్న బీటీ నిర్మాణ పనులకు పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు.

### గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్వాసిత రైతుల ముందస్తు అరెస్ట్

సంగెం : రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రాక సందర్భంగా గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్వాసిత రైతులను పోలీసులు శనివారం ఉదయం ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై వదిలేశారు. ఇటీవల సర్వేకు వచ్చిన అధికారులను అడ్డుకున్న సందర్భంగా మంత్రి పర్యటనకు ఆటంకాలు ఎదురుకాకుండా పోలీసులు ముందస్తు అరెస్ట్‌కు పాల్పడ్డట్టు తెలుస్తోంది. అరెస్టైన వారిలో వేల్పుల కుమారస్వామి, మాదినేని రాంరెడ్డి తదితరులున్నారు.

### ప్రభుత్వ పాఠశాలకు రూ.లక్ష విరాళం



వర్ధన్నపేట : పట్టణానికి చెందిన ఎన్ఆర్ఐ అల్లమనేని పూర్ణచందర్‌రావు స్థానిక ప్రభుత్వ పాఠశాలకు శనివారం రూ.లక్ష విరాళం అందించారు. ఈ సందర్భంగా పూర్ణచందర్‌రావు తండ్రి మోహన్‌రావు మాట్లాడారు. పాఠశాల వద్ద అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకుంటున్నట్లు పత్రికల్లో కథనాలు రావడంతో స్నేహితులైన బుజ్జ సురేందర్, యాంసాని శ్రీధర్ ద్వారా తెలుసుకున్న పూర్ణచందర్‌రావు స్పందించి సీసీ కెమెరాల ఏర్పాటు, స్పోర్ట్స్ మెటీరియల్, తదితరాల కోసం వినియోగించాలని కోరుతూ చెక్కు పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రంగ అనిల్, ఉపాధ్యాయులు రమణారావు, మనుజేందర్‌రెడ్డి, కుమారస్వామి, దేవయ్య, మదన్‌మోహన్ పాల్గొన్నారు.

### దుప్పట్ల పంపిణీ



నల్లబెల్లి : 'వణుకుతున్నా.. చలించరా?' శీర్షికతో 'సాక్షి'లో ఇటీవల ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. సమస్యను ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ స్వేరోస్ ఇంటర్నేషనల్ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజేంద్రప్రసాద్ సహకారంతో స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లగా ఆ సంస్థ ప్రతినిధులు హాస్టల్‌లో ఉంటున్న 40 మంది విద్యార్థులకు దుప్పట్లు అందించేందుకు ముందుకొచ్చారు. నర్సంపేట డివిజన్ సంక్షేమ అధికారి శంకర్ విద్యార్థులకు శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ హాస్టల్ సంక్షేమ అధికారి రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

### శివ, రామనామ ప్రతుల ఆవిష్కరణ

పర్వతగిరి : మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులు పద్మజ, సుభాషిని, మాలతి, మల్లికార్జున, కృష్ణవేణి, తదితరులు శివనామ, రామనామ ప్రతులను శనివారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. శృంగేరీ పీఠం జగద్గురువు పరమహంస పరివ్రాజ్యకాచార్య, శ్రీ భారతి తీర్థ స్వామి దేశవ్యాప్తంగా వంద కోట్ల ప్రతులను రాయించి శృంగేరీలో నిర్మించనున్న రామాలయం నిక్షిప్తం చేయనున్నట్టు తెలిపారు. భక్తులు రాసిన ప్రతులను శృంగేరి పీఠానికి పంపిస్తామని చెప్పారు. హిందువులందరూ శివ, రామనామ ప్రతులు రాసి పంపించాలని కోరారు.

### అన్నప్రాసన

చెన్నారావుపేట : మండలంలోని ఈర్యాతండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ మేడి సరోజన ఇద్దరు చిన్నారులకు శనివారం అన్నప్రాసన చేయించారు. కార్యక్రమంలో భూక్య శాంతమ్మ, మూడు ఈరమ్మ, గుగులోతు మానస, భూక్య రాణి, ధరంసోతు రమ్యశ్రీ, గుగులోతు స్వాతి, ధరంసోతు రమ్యశ్రీ, స్వాతి, పావని, తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థికసాయం

దుగ్గొండి : మండలంలోని రేకంపల్లికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు కొలుగూరి శ్రీను ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి పార్టీ తరపున శనివారం రూ.50 వేల సాయం అందజేశారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులు రూ.21 వేలు అందించారు. తొలుత బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రల బాబు, చెన్నూరి కిరణ్‌రెడ్డి, ఒలిగె నర్సింగరావు, మట్ట రాజు, ద్యాగం శివాజీ, దంజ్యా నాయక్, సాంబయ్య, మమత, ఇంద్రదేవ్, తదితరులు పాల్గొన్నారు.

# వరి కొయ్యలను కాలిస్తే అనర్థాలు

- రైతులు అవగాహన పెంచుకోవాలి
- కలియదున్నితే బహుళ ప్రయోజనాలు



వరి కొయ్యలను కాలుస్తున్న రైతులు

వర్ధన్నపేట : వరి పంటను రైతులు గతంలో కొడవళ్లతో మొదళ్ల వరకు కోయడం ఆనవాయితీగా ఉండేది. పశు పోషణపై మక్కువ చూపిన రైతులు వరిగడ్డిని కుప్పలుగా పశువుల ఆహారం కోసం నిల్వ చేసేవారు. కానీ కొంత కాలంగా పశువుల సంఖ్య తగ్గిపోవడంతోపాటు యంత్రాల వినియోగంపై రైతులు మక్కువ చూపుతున్న విషయం తెలిసిందే. హార్వెస్టర్‌తో వరిని కోస్తుండడంతో కొయ్యలు పెద్ద సైజులో మిగిలి కొయ్యలుగా ఉంటున్నాయి. అవసరమున్న రైతులు కొంత గడ్డిని తీసుకుంటూ మిగితా గడ్డిని వదిలేస్తున్నారు. దుక్కి దున్నే సమయంలో కొయ్యలు ఇబ్బందిగా మారుతాయన్న భావనతో నిప్పు పెడుతున్నారు. వాస్తవానికి వరికొయ్యలు కలియదున్నితే భూసారం పెరిగి రైతులకు మేలు చేకూరుతుది. కానీ సరైన అవగాహన లేక పలువురు రైతులు వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వరి కొయ్యలను కలియదున్నితే పొలానికి సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందంటూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

**కాల్చడంతో భవిష్యత్ పంటలకు నష్టం**

పొలంలో వరికొయ్యలను కాల్చడం అత్యంత ప్రమాదకరమని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు అవగాహన లేమితో పంటలకు ఎంతో మేలు చేసే కొయ్యలను భూమిలో కలియ దున్నకుండా నిప్పు పెట్టి భవిష్యత్ పంటలను నాశనం చేస్తున్నారని, వాతవరణాన్ని తీవ్రంగా కలుషితం చేస్తున్నారని అధికారులు అంటున్నారు. కొయ్యలను కాల్చి వేసే సమయంలో భూమి గట్టిపడడంతో పొలాన్ని కలియ దున్నడం వీలు కాదు. అలాగే భూమిలో ఉండే సూక్ష్మజీవులు, వానపాములు నశించే ప్రమాదం ఉంది. భూమి గుల్లగా మారే పరిస్థితి ఉందని, నాట్లు వేసిన సమయంలో వేర్లకు సరిగ్గా పోషకాలు అందదని, పైరు ఎదగదని వ్యవసాయ అధికారులు తెలిపారు.

**కలియ దున్నితే మేలు**

పంట కోసిన వెంటనే వరి కొయ్యలను కాల్చకుండా పొలంలోనే కలియదున్నాలి. తద్వారా కొయ్యలు మట్టితో కప్పబడి కుళ్లే ప్రక్రియ ప్రారంభం అవుతుంది. తర్వాత సేంద్రీయ ఎరువుగా మారుతుంది. రైతులకు అవగాహన లేక వరి కొయ్యలకు నిప్పు పెడుతున్నారన్నది జగమెరిగిన సత్యం. వ్యవసాయ శాఖ అధికారులు రైతులను చైతన్యవంతం చేయాల్సిన ఆవశ్యకత ఉంది.

## 'షాద్‌నగర్ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి'



నర్సంపేట రూరల్ : ఫిర్యాదు చేస్తున్న నాయకులు

నర్సంపేట రూరల్/నల్లబెల్లి/వర్ధన్నపేట/ఖానాపురం : వెలమ కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేశాడంటూ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీరపల్లి శంకర్‌పై నర్సంపేట, నల్లబెల్లి, వర్ధన్నపేట, ఖానాపురం మండలాల్లో వెలమ సంఘం నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నర్సంపేటలో వెలమ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా జాయింట్ సెక్రటరీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, నల్లబెల్లిలో వెలమ పరపతి సంఘం అధ్యక్షుడు బచ్చు వెంకటేశ్వర్లు మాట్లాడారు. వెలమ కులస్తులపై ఎమ్మెల్యే శంకర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీని కోరారు. కార్యక్రమంలో సంఘం నర్సంపేట డివిజన్ కమిటీ గౌరవ అధ్యక్షుడు మోహన్‌రావు, అధ్యక్షుడు మేడవరపు కమలాకర్‌రావు, నాయకులు కోమాండ్ల భూపాల్‌రావు, సందినేని వెంకటేశ్వర్‌రావు, ఇర్కు కోటేశ్వర్‌రావు, సుధాకర్‌రావు, హన్మంతరావు, నడిపెల్లి రాజేశ్వర్‌రావు, బచ్చు వెంకటేశ్వర్‌రావు, దేవేందర్‌రావు, వేంకటేశ్వర్‌రావు, సోమేశ్వర్‌రావు, నర్సింహరావు, సుధీర్‌రావు, సందినేని సంపత్ రావు, బచ్చు సంపత్‌రావు, పాడుపుగంటి రాకేశ్‌రావు, సోమేశ్వర్‌రావు, హరీష్‌రావు, రాజేశ్వర్‌రావు, యుగేందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

చెన్నారావుపేట : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని అక్కల్‌చెడ గ్రామంలో స్థానిక పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు తేమ, తాలు లేకుండా ధాన్యం తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం సన్న ధాన్యంపై క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తోందని తెలిపారు. ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలని, రైతులకు సదుపాయాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పులిశేరు రాజేందర్, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ మహేందర్‌రెడ్డి, సీఈఓ చిట్టి రవి, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో రోడ్ల నిర్మాణం

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న హామ్యానాయక్

రాయపర్తి : పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సహకారంతో గ్రామాల్లో రోడ్లు అభివృద్ధి చెందుతున్నాయని తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హామ్యానాయక్ తెలిపారు. మండలంలోని ఊకల్‌లో ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డితో కలిసి హామ్యానాయక్ శనివారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో రోడ్లు, ఇతర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తుండగా ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ప్రజలకు వసతులు కల్పించేలా అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, మాచర్ల ప్రభాకర్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బూడిద రవి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, వల్లపు కుమార్, సుదర్శన్‌రెడ్డి, ముద్రబోయిన వెంకన్న, మందపురి మహేందర్, లేతాకుల యాదవరెడ్డి, దేదావత్ రామ, తదితరులు పాల్గొన్నారు.

## హమాలీల కూలి రేట్లు పెంచాలి

- ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశం

నర్సంపేట : పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా హమాలీల కూలి రేట్లు పెంచాలని, రైస్ మిల్లుల్లో ధాన్యం దిగుమతులకు వినియోగిస్తున్న ప్లాస్టిక్ సంచులను నిషేధించాలని ఏఐఎఫ్‌టీయూ (న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చాక సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలతో కుమ్మక్కై సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని విమర్శించారు. యాజమాన్యాలతో చేసుకున్న ఒప్పందం ఈనెల 21తో ముగుస్తున్న క్రమంలో పాత రేట్లపై 50 శాతం పెంచేలా అగ్రిమెంట్ చేయాలని కాంక్షించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఈర్ల పైడి, అధ్యక్షుడు బొర్ర ఆనంద్, నాయకులు రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఉన్నతిలో తల్లిదండ్రులు కీలకం

- ప్రిన్సిపాల్ మాధవరావు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మాధవరావు

సంగెం : విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కాక మాధవరావు తెలిపారు. మండల కేంద్రలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన తల్లితండ్రులు-అధ్యాపకుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రతిరోజూ కళాశాల హాజరయ్యేలా తల్లితండ్రులు బాధ్యత తీసుకోవాలని చెప్పారు. అలాగే కళాశాల నుంచి ఇంటికి వచ్చాక హోమ్ వర్క్ చేసేలా పర్యవేక్షించాలని తెలిపారు. తద్వారా పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. తల్లితండ్రులు, అధ్యాపకుల సమన్వయంతో వ్యవహరిస్తే విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరడం సులువని స్పష్టం చేశారు.

### పశు వైద్యశిబిరం

చెన్నారావుపేట : మండలంలోని లింగాపురంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మంజీలాల్ మాట్లాడారు. ఆడదూడలను పుట్టించే లింగ నిర్ధారణ చేసిన సెక్స్ సార్టెడ్ సెమెన్ పశు వైద్యశాలల్లో, గోపాలమిత్రల వద్ద అందుబాటులో ఉందని చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో 124 పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ జహంగీర్, గోపాలమిత్రులు మధుకర్, కళ్లెపు ప్రసాద్, లక్ష్మీనారాయణ, రమేశ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### మహిళకు, ప్రియుడికి దేహశుద్ధి

రాయపర్తి : భర్త కళ్లు గప్పి భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తోందని గ్రామస్తులు ఆమెను, ప్రియుడిని చితకబాదారు. రాయపర్తి మండలం ఎలుకబండ తండా(లుంబతండా)కు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి ఇటీవల భూపాలపల్లికి బదిలీ అయ్యాడు. ఈ క్రమంలో అతడి భార్యకు భూపాలపల్లికి చెందిన కొలిపాక శ్రీకాంత్‌తో వివాహేతర సంబంధం ఏర్పడింది. తరచూ అతడితో ఫోన్‌లో మాట్లాడుతోంది. ఈ మధ్య బహిరంగంగానే అతడితో తిరగడం ప్రారంభించింది. విషయాన్ని గమనించిన భర్త.. తల్లిదండ్రుల ఇంటికి పంపించాడు. అయినప్పటికీ ఆమె బుద్ధి మారలేదు. ఇంట్లోనే రహస్యంగా అతడిని పిలిపించుకుని కలవడం ప్రారంభించింది. తండావాసులు, అతడి కుటుంబ సభ్యులు వారిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. పోలీసులు శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. భర్తను మోసం చేసి కుటుంబ పరువు తీసిందని ఆమెను స్థానికులు దూషించారు.

### జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ

పర్వతగిరి : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థి జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చాటాడు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో ఆ స్కూల్ పదో తరగతి విద్యార్థి శివప్రసాద్ రెండో స్థానంలో నిలిచి రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్ సత్యశారద చేతుల మీదుగా బహుమతి అందుకున్నాడు. శివప్రసాద్‌ను ఉపాధ్యాయులు, సిబ్బంది శనివారం అభినందించారు.

### ఆటోల బంద్ విజయవంతం

దుగ్గొండి/ఖానాపురం/చెన్నారావుపేట: దుగ్గొండి, ఖానాపురం, చెన్నారావుపేట మండలాల్లో ఆటోల బంద్ శనివారం విజయవంతం అయ్యింది. దుగ్గొండి మండలంలోని దుగ్గొండి, గిర్నిబావి, తిమ్మంపేట, మహ్మదాపురం, నాచినపల్లి-పొనకల్ అడ్డాల పరిధిలో నిరసన తెలిపారు. దుగ్గొండి టీఏడీయూ మండల అధ్యక్షుడు బూర రామకృష్ణగౌడ్, బుధరావుపేట యూనియన్ అధ్యక్షుడు పసునూరి వెంకన్న మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినప్పటి నుంచి ఆటోకార్మికులు దుర్భర జీవితాలు గడుపుతున్నారని చెప్పారు.

### ఇద్దరికి గాయాలు

నెక్కొండ : మండలంలోని సూరిపల్లికి చెందిన దొమ్మటి యాకయ్య, సాయిబాబా ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా తెలంగాణ గురుకుల పాఠశాల/కళాశాల వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. యాకయ్య, సాయిబాబా గాయాలపాలవగా వారిని స్థానికులు 108 వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు.

### అధిక సాంద్రత పత్తి సాగు మేలు



వర్ధన్నపేట : రైతులు అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయడం మేలని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న తెలిపారు. జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా కేవీకే ఆధ్వర్యంలో మండలంలోని దమ్మన్నపేటలో రైతులకు శనివారం ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేస్తే కూలీల ఖర్చుతోపాటు పంట కాలం తగ్గుతుందని చెప్పారు. అధిక దిగుబడి సాధించవచ్చని, యాంత్రీకరణ సాధ్యమని తెలిపారు. పత్తి ఏరిన తర్వాత కర్రలను కాల్చకుండా ముక్కలుగా చేసి భూమిలో కలియదున్నాలని చెప్పారు. కార్యక్రమంలో ఆహార భద్రత కన్సల్టెంట్ సారంగం, ఏఓ విజయ్‌కుమార్, మురళీమోహన్, నాగరాజు, హర్షరెడ్డి, సాయిచంద్, సుశృత్ పాల్గొన్నారు.

# సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



గీసుకొండ : విగ్రహాలను తీసుకెళ్తున్న అర్చకులు



నెక్కొండ : కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గీసుకొండ: మండలంలోని ఊకల్‌హవేలిలోని ప్రసిద్ధ నాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం శనివారం వైభవంగా జరిగింది. మధ్యాహ్నం 12.10 గంటలకు వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ వల్లీదేవి, దేవసేనా దేవిలతో స్వామి వారి వివాహం నిర్వహించారు. అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్ష వివాహ తంతు నిర్వహించి భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆలయాన్ని సందర్శించగా ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి వారి దర్శనం చేయించారు. ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో నాగేంద్ర సుబ్రహ్మణ్య స్వామి కల్యాణ వేడుక చేపట్టారు. అర్చకులు బూర్గుపల్లి వెంకట లక్ష్మీనర్సింహాశాస్త్రి ఆధ్వర్యంలో మూల విరాట్‌కు పంచామృత అభిషేకాలు, సుగంధ ద్రవ్యాలు, పళ్ల రసాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. సర్ప సూక్త, శ్రీ సూక్త, పురుష సూక్త, దుర్గా సూక్త పారాయణాలు నిర్వహించారు. అనంతరం కల్యాణ క్రతువు చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు బూర్గుపల్లి శ్రవణ్‌శాస్త్రి, డింగరి శేష పవన్, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామికి అభిషేక పూజలు



మెట్లకు పూజ చేస్తున్న అర్చకుడు, భక్తులు

నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా ఆధ్వర్యంలో అర్చకులు అయ్యప్పస్వామికి శనివారం అభిషేక పూజలు నిర్వహించారు. దొడ్డ అర్వన్, వేణు స్వప్న, విజయ దేవేందర్‌రెడ్డి, దాసరి ఉమాదేవి తిరుపతిరెడ్డి, మనస్విని ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మాధవశంకర్ గుప్తా మాట్లాడారు. నేడు (ఆదివారం) నిర్వహించనున్న పల్లివేటకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పైస సురేశ్, ప్రతినిధులు చింతల కమలాకర్‌రెడ్డి, రవీందర్, మాదారపు చంద్రశేఖరం, శ్రీరాం ఈశ్వరయ్య, బండారుపల్లి చెంచా రావు, పాలకుర్తి శ్రీనివాస్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : బీఆర్‌ఎస్ హయాంలోనే నర్సంపేట నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అవినీతి, అక్రమ కేసులు, పోలీస్ రాజ్యం మాత్రమే నడుస్తోందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సిటిజన్స్ క్లబ్‌లో శనివారం నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మార్పు కోసం మాత్రమే నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించగా ఎమ్మెల్యే మాధవరెడ్డి సీఎంతో సఖ్యత లేనట్టు నటిస్తూ చీకటి ఒప్పందాలతో ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్ని కేసులు బనాయించినా భయపడేది లేదన్నారు. ఈ ఏడాది అధిక వర్షాలతో నష్టపోయిన రైతులను ఓదార్చిన నాయకుడు లేడని, ఒక్క రూపాయి కూడా పరిహారం ఇవ్వలేదని తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలో మంజూరు చేసిన అభివృద్ధి పనులను ఆపేశారని చెప్పారు. ఆర్‌ఎఫ్ఓఆర్ పట్టాలపై రుణం తీసుకోవాలన్నా లంచం ఇవ్వాల్సిన దుస్థితి నెలకొందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీఓ నంబర్ 346 ద్వారా రూ.75 కోట్లతో నియోజకవర్గానికి వ్యవసాయ యంత్రీకరణ ప్రాజెక్టును మంజూరు చేయగా అందులో రూ.16 కోట్లు ఖర్చు చేయగా మిగతా రూ.59 కోట్ల వెనక్కుపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామినాయక్, ఆర్‌ఎస్‌ఎస్ మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో బంగారు భవిష్యత్‌కు బాటలు

- స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణ, ఎంపీడీఓ శ్రీవాణి



ఖానాపురం : మాట్లాడుతున్న ఎంపీడీఓ భారతి

చెన్నారావుపేట : క్రీడలతో బంగారు భవిష్యత్తుకు బాటలు పడతాయని మండల స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణ, ఎంపీడీఓ శ్రీవాణి తెలిపారు. మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్‌లో నిర్వహించిన సీఎం కప్ కబడ్డీ, ఖోఖో పోటీలను శనివారం వారు ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ యువతకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పించేలా పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయ, పంచాయతీ కార్యదర్శి కృష్ణంరాజు, కలామ్స్ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భాషుమియా, మధు, అమ్మ ఆదర్శ కమిటి చైర్మన్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్ సైనిక్ స్కూల్ ఆవరణలో నిర్వహించిన పోటీలను ఎంపీడీఓ భారతి ప్రారంభించి మాట్లాడారు. యువత క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ అంబటి సునీల్, ప్రిన్సిపాల్ సురేందర్, ఎంఈఓ శ్రీదేవి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికారి ప్రతినిధి రవీందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : మండల కేంద్రంలోని ఎంపీపీఎస్‌లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. క్రీడల నిర్వహణకు కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా హెచ్‌ఎం సునీత, చైర్మన్‌గా పంచాయతీ కార్యదర్శి వినోద్‌కుమార్, సభ్యుడిగా పీడీ కొమ్ము శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మచ్చ రమేశ్, ఉస్మాన్, పీరని ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోళ్లలో అవకతవకలు

- ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్

నర్సంపేట : పత్తి కొనుగోళ్లలో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేశ్ తెలిపారు. వాస్తవ సాగుదారుల పత్తిని సీసీఐ బేషరతుగా కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐకేఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకులు, డీడీఎం, డీఎంఓ, ఎనుమాముల మార్కెట్ కార్యదర్శులకు వినతిపత్రాలు అందించి మాట్లాడారు. పత్తి రైతులు వ్యయ ప్రయాసలకోర్చి, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొని పండిస్తే కుంటి సాకులతో రైతుల నుంచి పత్తి కొనడం లేదన్నారు. ఇదే అవకాశంగా దళారులు రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి అదే పత్తిని సీసీఐకి అధిక ధరకు అమ్ముతున్నారని వివరించారు. దళారులు, వ్యాపారులు, కొందరు సీసీఐ అధికారుల కుమ్మక్కై నిలువునా ముంచుతున్నారని తెలిపారు. రైతుల నుంచి నేరుగా పత్తి కొనుగోలు చేసి న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో దోపిడీని బట్టబయలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి హంసారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాబురావు, మహ్మద్ ఇస్మాయిల్, ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి జగదీశ్వర్, జిల్లా సహాయ కార్యదర్శి రాంచందర్, నాయకులు నగేశ్, పరిమల గోవర్ధన్ రాజు తదితరులు పాల్గొన్నారు.